## రేపు ఉద్యోగ మేళా

కంఠేశ్వర్, మార్చి 4 : జిల్లాలోని నిరుద్యోగుల కోసం ఈ నెల 6వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లా కేంద్రంలోని శివాజీనగర్ లో ఉన్న ఉపాధి కార్యాలయంలో నిర్వహించే ఉద్యోగ మేళాలో పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9581768413, 9948748428, 9959456793 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## దరఖాస్తులకు ఆహ్వానం

ఇందల్వాయి, మార్చి 4 : మండలంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. https://tsemrs.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 22వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని, వచ్చే నెల 21న ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు.

## పరీక్ష అట్టల పంపిణీ

కోటగిరి/ డిచ్‌పల్లి, మార్చి 4 : కోటగిరి మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పదోతరగతి విద్యార్థినులకు కోటగిరి రిటైర్డ్ ఎంఈవో నరేశ్‌కుమార్ పరీక్ష అట్టలను సోమవారం పంపిణీ చేశారు. పరీక్షలు రాసే విషయంలో పలు సూచనలు చేశారు. కేజీబీవీ ప్రత్యేకాధికారిణి సవితారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. డిచ్‌పల్లి మండలం సుద్దపల్లిలోని పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన నరేశ్.. పెన్నులు, పెన్సిళ్లు, కంపాక్స్‌బాక్స్‌లను అందజేశారు.

## పీఎం సూర్యఘర్ - ముఫ్త్ బిజిలీ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

ఖలీల్‌వాడి, మార్చి 4 : పీఎం సూర్యఘర్ – ముఫ్త్ బిజిలీ యోజనను సద్వినియోగం చేసుకోవాలని కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) జిల్లా మేనేజర్ గౌతమ్ సూచించారు. ఈ పథకానికి సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఈ పథకం ద్వారా 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుందని, 40 శాతం సబ్సిడీ ఉంటుందని పేర్కొన్నారు. ఈ పథకానికి అర్హులైన వినియోగదారుల ఇండ్ల పైకప్పుపై సోలార్ అమర్చుతామని తెలిపారు. సౌర విద్యుత్ వినియోగంతో కరెంట్ బిల్లు భారం తగ్గుతుందని, వినియోగదారులు తమ వివరాలను కామన్ సర్వీస్ సెంటర్ సిబ్బందికి అందజేస్తే.. ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కామన్ సర్వీస్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు.

## తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ఫోరం ఎన్నిక

కోటగిరి, మార్చి 4 : మండలకేంద్రంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ఫోరాన్ని సోమవారం ఎన్నుకున్నట్లు ఉద్యమకారుల ఇన్‌చార్జి గంగాధర్‌దేశాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన ఉద్యమకారులు సమావేశమై ఫోరాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంగాధర్‌దేశాయ్ (కోటగిరి), ప్రధానకార్యదర్శిగా ఉడత గంగాధర్ గుప్తా (బాన్సువాడ), ఉపాధ్యక్షులుగా మాధవ్ యాదవ్ (బీర్కూర్), షేక్ జఠర్ (మోస్రా), కృష్ణ (బాన్సువాడ), కార్యదర్శులుగా కొతిమీర్‌కర్ జయరాం (మోస్రా), ఎర్రమట్టి సాయిబాబా (హన్మాజీపేట్), సహాయ కార్యదర్శిగా బెలకోని రవి పటేల్ (బరంగేడ్గి), క్యాషియర్‌గా అల్లావుద్దీన్ (రుద్రూర్), సభ్యులుగా తోట విఠల్, పందిరి శ్రీనివాస్, వహీద్, సాయిలు, రాజును ఎన్నుకున్నారు.

# 'ప్రజావాణి'కి 131 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అధికారులు

కంఠేశ్వర్, మార్చి 4 : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 131 ఫిర్యాదులు వచ్చాయని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి, డీఆర్డీవో సాయాగౌడ్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

**హాజరుకాని అధికారులు..**
**తీరని సమస్యలు.**

కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు గైర్హాజరు కావడం పరిపాటిగా మారింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలు.. తమ సమస్యలను అధికారులకు విన్నవించుకుంటారు. ప్రజావాణి కార్యక్రమానికి పలుశాఖల అధికారులు హాజరుకావడం లేదు. దీంతో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో పలుమార్లు తిరగాల్సిన పరిస్థితి నెలకొంటున్నదని ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.



నగరంలో గృహజ్యోతి జీరో విద్యుత్ బిల్‌ను ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ లబ్ధిదారుకు విద్యుత్ శాఖ అధికారులతో కలిసి సోమవారం అందజేసి పథకాన్ని ప్రారంభించారు. 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వాడిన వారికి ప్రభుత్వం ఉచితం సరఫరా చేస్తున్నదని తెలిపారు.

– ఖలీల్‌వాడి, మార్చి4

## ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి, మార్చి 4 : డిచ్‌పల్లిలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మగ్గం వర్క్, ఉమెన్స్ టైలరింగ్, బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్, జ్యూట్ బ్యాగ్స్ మేకింగ్, ఆర్టిఫిషియల్, జువెల్లరీ మేకింగ్‌లో శిక్షణ ఉంటుందని వివరించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన 19 నుంచి 45 ఏండ్లలోపు మహిళలు అర్హులని, భోజనం, హాస్టల్ వసతి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 08461-295428 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

## చిరుతను పట్టేందుకు బోనును ఏర్పాటు చేయాలి

రుద్రూర్, మార్చి 4 : అక్బర్‌నగర్ గ్రామశివారులో బోను ఏర్పాటు చేసి పులిని పట్టుకోవాలని గ్రామస్తులు డీఎఫ్‌వోకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. రెండు రోజుల క్రితం అర్ధరాత్రి మేకపై చిరుత దాడి చేసిందని, పరిశోధనా స్థానంలో కూడా చిరుత సంచరిందని పేర్కొన్నారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయని.. గ్రామస్తులు భయాందోళన చెందున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరారు.

## బాపూజీ వచనాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన



భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

సుభాష్‌నగర్, మార్చి 4: జిల్లాకేంద్రంలోని బాపూజీ వచనాలయం నూతన భవన నిర్మాణానికి ప్రజాప్రతినిధులు సోమవారం శంకుస్థాపన చేశారు. పాత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అక్కడే నూతన భవనాన్ని సుమారు రూ. 2 కోట్లతో నిర్మించనున్నట్లు వచనాలయ అధ్యక్షుడు భక్తవత్సలం తెలిపారు. ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మేయర్ దండు నీతూ కిరణ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్యే ఆకుల లలిత తదితరులు శంకుస్థాపన చేశారు. వచనాలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి

డిచ్‌పల్లి, మార్చి 4 : గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని డీఎల్పీవో శ్రీనివాస్ అన్నారు. డిచ్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి కోసం పన్ను వసూళ్లపై దృష్టి సారించాలన్నారు.

**నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి**

కోటగిరి, మార్చి4 : వేసవిలో నీటిఎద్దడి తలెత్తకుండా చూడాలని డీఎల్పీవో సాయిబాబా అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, ఎంపీవో మారుతి, పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు పాల్గొన్నారు.

## జిల్లా జైలులో రిమాండ్ ఖైదీ మృతి

వినాయక్‌నగర్, మార్చి 4 : నిజామాబాద్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న ఖైదీ మృతిచెందాడు. పోలీసుల ద్వారా అందిన సమాచారం మేరకు కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలానికి చెందిన దండుగుల తిరుమలయ్య (28) ఎల్లారెడ్డి పరిధిలో చోరీ చేసిన కేసులోఎనిమిది నెలలుగా జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. సోమవారం తెల్లవారుజామున తిరుమలయ్య నిద్రలేవకపోవడంతో తోటి ఖైదీలు జైలు సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది అతడిని జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించగా నిద్రలో గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జైలు అధికారులు ఆరో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## రామకృష్ణ శర్మకు ఉగాది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న వేలేటి రామకృష్ణ శర్మ

సుభాష్‌నగర్, మార్చి 4 : జిల్లాకేంద్రానికి చెందిన ప్రముఖ పురోహితుడు వేలేటి రామకృష్ణ శర్మకు సీవీ రామన్ అకాడమీ ప్రతినిధులు ఉగాది మహోత్సవ పురస్కారాన్ని అందజేశారు. సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో సినీనటుడు కాదంబరి కిరణ్‌కుమార్, జనార్దన్‌రావు ఆదివారం పురస్కారాన్ని అందజేశారని తెలంగాణ గాయత్రీ ధార్మిక సాహితీ సేవా సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ప్రకాశ్‌శర్మ, అరుణ తెలిపారు. రెండు దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లాలో ధార్మిక సేవలు అందిస్తున్నందుకు పురోహిత వైభవ రత్న పురస్కారంతో సత్కరించారు.



విజేత జట్టుకు కప్‌ను అందజేస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

## ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

డిచ్‌పల్లి, మార్చి 4 : టీయూలో కొనసాగిన ఇంటర్ కాలేజీ క్రికెట్ మెన్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. ఫైనల్‌లో తెలంగాణ వర్సిటీ టీం, గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల టీం తలపడగా.. తెలంగాణ వర్సిటీ క్రికెట్ జట్టు గెలిచినట్లు రిజిస్ట్రార్ యాదగిరి తెలిపారు. విజేత జట్టుకు రిజిస్ట్రార్ కప్‌ను అందజేశారు. వర్సిటీ డైరెక్టర్ స్పోర్ట్స్ డాక్టర్ జి.బాలకిషన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బీఆర్.నేత, గిరిబాలమణి, జూనియర్ అసిస్టెంట్ నరేశ్ జాదవ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## అదుపుతప్పి కారు బోల్తా.. యువకుడి మృతి

జక్రాన్‌పల్లి, మార్చి 4 : కారు అదుపుతప్పి బోల్తాపడడంతో ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తొర్లికొండకు చెందిన ఏలేటి సాయి ప్రశాంత్ (28) తొర్లికొండ నుంచి కారులో ఆర్మూర్‌కు సోమవారం వెళ్తుండగా బ్రాహ్మణ్‌పల్లి గ్రామశివారులో అదుపుతప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో సాయి ప్రశాంత్ తలకు బలమైన గాయాలుకావడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.



నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో 316 మందికి అర్బన్ ఎమ్మెల్యే కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ.. ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, మేయర్ నీతూకిరణ్‌తో కలిసి సోమవారం అందజేశారు. అనంతరం సంత్ రవిదాస్ జయంతి ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు. పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. – వినాయక్‌నగర్, మార్చి 4

# హెల్ప్‌డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మోర్తాడ్‌లో హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ శివలింగు శ్రీనివాస్

మోర్తాడ్/భీమ్‌గల్/రుద్రూర్/ధర్పల్లి, మార్చి4: మోర్తాడ్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజాపాలన హెల్ప్‌డెస్క్‌ను ఎంపీపీ శివలింగు శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... గృహజ్యోతి, మహాలక్ష్మీ పథకాలు అందని వారు హెల్ప్‌డెస్క్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుమల, ఎంపీవో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.భీమ్‌గల్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీవో గంగామోహన్ తెలిపారు. 200 యూనిట్ల ఉచిత కరెంట్, గ్యాస్ సిలిండర్ కొత్తగా రిఫిల్ చేసుకున్న తర్వాత రూ.500 సబ్సిడీ రాకపోతే సంప్రదించాలని కోరారు. రుద్రూర్‌లోని మండల సమీకృత భవనంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఎంపీడీవో సురేశ్‌బాబు ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు సేవా కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీవో సాయిలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ధర్పల్లి మండలం కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంపీవో రాజేశ్ తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఆర్మూర్ పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవాలు సోమవారం నిర్వహించారు. ఎంపీ అర్వింద్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. – ఆర్మూర్‌టౌన్, మార్చి4



బోధన్ మండలంలోని పెగడపల్లి గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ కుల సంఘం ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో యజ్ఞం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ముదిరాజ్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. – బోధన్ రూరల్, మార్చి4

## బీజేపీలోకి ఇద్దరు కార్పొరేటర్లు

వినాయక్‌నగర్, మార్చి 4 : నగరంలోని ఇద్దరు కార్పొరేటర్లు సోమవారం బీజేపీలో చేరారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో 17, 37వ డివిజన్ల కార్పొరేటర్లు సబితారాజ్, ఉమారాణితోపాటు 40వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాయవారి సాయిరాం బీజేపీలో చేరారు.

## డిజిటల్ లావాదేవీలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా సహకార బ్యాంకు అధికారులు, ఉపాధ్యాయులు

బోధన్, మార్చి 4: బోధన్ పట్టణంలోని తట్టికోట్ ప్రాథమికోన్నత పాఠశాలలో జిల్లా సహకార బ్యాంకు ఆధ్వర్యంలో విద్యార్థులకు డిజిటల్ లావాదేవీలపై బ్యాంకు అధికారులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. బ్యాంకు ద్వారా అందిస్తున్న డిజిటల్ సేవలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి, అందులోని అంశాలపై వివరించారు. ఖాతాల వినియోగం, పొదుపు, అప్పు, బీమా పథకాలపై బ్యాంకు మేనేజర్ కలీం, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిశోర్ వివరించారు.

## మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

రెంజల్, మార్చి 4: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను పీఆర్టీయూ జిల్లా శాఖ తరపున ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో సన్మానించారు. మండలంలోని శోభరాణి(దండిగుట్ట), నాజ్‌ఫాతిమా(ఎంపీపీఎస్ నీలా), జ్యోతి ( మోడల్ స్కూల్ రెంజల్)లను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సన్మానించారు.

## పొలంలో కాలుజారి పడి ఒకరి మృతి

రెంజల్,మార్చి 4: మండలంలోని తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన సందులా నాగారాజు(40) పొలంలో గట్టుపై నడుచుకుంటూ వెళ్తుండగా కాలు జారి బురదలో పడి మృతి చెందినట్లు ఏఎస్సై బాబురావు సోమవారం తెలిపారు. తనపొలంలో గల్మ కట్టేందుకు ఆదివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లాడు. సోమవారం పంట పొలంలో మృతి చెంది కనిపించాడని మృతుడి భార్య సందుల అనిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. నాగారాజు రెండుమూడు రోజుల్లో ఉపాధి కోసం దుబాయ్ వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. ఆయన మృతి చెందడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కూతుళ్లు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.



బోధన్ పట్టణం రాకాసీపేట్‌లోని మార్కండేయ ఆలయ పునరుద్ధరణ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పద్మశాలీ సంఘం ప్రతినిధులు, కులపెద్దలు పర్యవేక్షించారు. – బోధన్, మార్చి 4

# కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



మాక్లూర్‌లో చెక్కులు అందజేస్తున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

నందిపేట్/మాక్లూర్/ఆర్మూర్‌టౌన్, మార్చి 4: నందిపేట్, ఉమ్మడి డొంకేశ్వర్ మండలాల లబ్ధిదారులకు మండల కేంద్రంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. మండలంలోని సంబాయి ఆలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మాక్లూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. 19 మందికి చెక్కులు మంజూరైనట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎంఏ షబ్బీర్, ఎంపీడీవో జైకాంతి తదితరులు పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి పంపిణీ చేశారు.

## నిధులు విడుదల చేసి పట్టణ అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలతా సురేందర్

భీమ్‌గల్, మార్చి 4: గత కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను విడుదల చేసి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలతా సురేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మున్సిపల్ సమావేశ మందిరంలో 2024-25 వార్షిక బడ్జెట్‌కు సంబంధించి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.12 కోట్ల 10 లక్షల వార్షిక బడ్జెట్‌ను ఆమోదిస్తూ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. రూ.3 కోట్ల 7 లక్షల 55 వేలు మున్సిపల్ సొంత నిధులు కాగా రూ.9 కోట్ల లక్షా 80 వేలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణమూర్తి, వైస్‌చైర్మన్ భగత్, మున్సిపల్ మేనేజర్ గౌరీశ్, అకౌంటెంట్ విజయ్, కౌన్సిలర్లు రాజశ్రీ లత నర్సయ్య, గంగాధర్, లింగయ్య, కైరున్నీసాబేగం, షమీం బేగం, కోఆప్షన్ సభ్యుడు నవీన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



బోధన్ చక్రేశ్వర శివమందిరంలో మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు గణేశ్ శర్మ, మహేశ్ పాఠక్ వివిధ పూజలు నిర్వహించారు. ఈ నెల 8న నిర్వహించనున్న మహాశివరాత్రి వరకు రుద్రాభిషేకం కొనసాగిస్తామని ఆలయ అర్చకులు వెల్లడించారు. సోమవారం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. – బోధన్, మార్చి 4

## సంక్షిప్తంగా..

- **చలివేంద్రం ప్రారంభం -** ధర్పల్లి, మార్చి 4 : మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో మణికంఠ వాటర్ ప్లాంట్ వారి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు.
- **ఘనంగా ధ్వజారోహణం -** ఇందల్వాయి, మార్చి 4 : మండలంలోని తిర్మన్‌పల్లిలో నిర్మించిన శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ధ్వజారోహణం నిర్వహించారు. అర్చకుడు గంగప్రసాద్ ఆధ్వర్యంలో హోమం, మంత్రపుష్పం, అన్నదానం తదితర కార్యక్రమాలను నిర్వహించారు.
- **పేకాటరాయుళ్ల అరెస్టు -** కోటగిరి, మార్చి 4 : మండల కేంద్రంలో పేకాడుతున్న ఏడుగురిని పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు సోమవారం సాయంత్రం పేకాటస్థావరంపై దాడులు చేసి, ఏడుగురు జూదరులపై కేసు నమోదు చేశామని.. వారి నుంచి రూ.19,640 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.
- **భూ సమస్యను పరిష్కరించాలి -** మోస్రా తహసీల్ కార్యాలయంలో జడ్పీటీసీ గుత్ప విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు, తహసీల్దార్ మారుతి.. ధరణి సమస్యలపై సోమవారం చర్చించారు. సర్వేనంబర్లు 952, 953 అటవీ, అసైన్‌మెంట్ భూమిగా ధరణిలో నమోదయ్యాయని, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. సమస్యను పరిష్కరించాలని రైతులతో కలిసి తహసీల్దార్‌ను కోరారు.
- **విద్యార్థులకు బ్యాగుల పంపిణీ -**కమ్మర్‌పల్లి, మార్చి 4: బషీరాబాద్ పాఠశాలలో వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా వచ్చిన బ్యాగులను ఎంఈవో ఆంధ్రయ్య సోమవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ సక్కారం అశోక్, ప్రధానోపాధ్యాయుడు వి.శంకర్‌గౌడ్, చంద్రమోహన్, ఉపాధ్యాయురాలు కవిత, నాయకులు పాల్గొన్నారు.
- **పరీక్ష అట్టల పంపిణీ:** మోర్తాడ్, మార్చి4: సుంకెట్, దొన్కల్ ఉన్నత పాఠశాలలతోపాటు మోర్తాడ్‌లోని కేజీబీవీ, బాలికల ఉన్నత, బాలుర ఉన్నత పాఠశాలల్లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలను సోమవారం పంపిణీ చేశారు. ఎంఈవో ఆంధ్రయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల రాములు, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు నీరజ్, మహిపాల్, అశోక్, రాజశేఖర్, వినోద్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.
- భీమ్‌గల్, మార్చి 4 : మండలంలోని ముచ్కూర్, పల్లికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ రహమాన్, మండల అధ్యక్షుడు పవన్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు.
- **చేంగల్‌లో ఎంపీడీవో పర్యటన -** భీమ్‌గల్, మార్చి 4: చేంగల్‌లో హరితహారం నర్సరీ, ఉపాధిహామీ పథకంలో నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను ఎంపీడీవో సంతోష్ కుమార్ సోమవారం పరిశీలించారు. జీపీ కార్యాలయంలో గ్రామస్థాయి అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి ప్రదీప్‌ను ఆదేశించారు. సమావేశంలో ఎంపీవో గంగామోహన్, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ గణేశ్ ఉన్నారు.
- **'గృహజ్యోతి' జీరోబిల్ అందజేత -** ముప్కాల్/బాల్కొండ, మార్చి 4: ముప్కాల్‌లో సోమవారం ఉదయం గృహజ్యోతి జీరో విద్యుత్ బిల్‌ను అధికారులు వినియోగదారులకు అందించారు. 200 యూనిట్ల లోపు వినియోగించిన కుటుంబాలకు జీరో బిల్‌ను అందజేస్తున్నామని అన్నారు. ముప్కాల్ ఏఈ రవి, ఈఈ కాంతారావు తదితరులు పాల్గొన్నారు. బాల్కొండలో విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్‌ను అధికారులు అందజేశారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.
- **పన్నుల వసూలుకు స్పెషల్ డ్రైవ్-** నవీపేట, మార్చి4: ఇంటి పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు ఎంపీడీవో రామకృష్ణ సోమవారం తెలిపారు. మండలంలోని 32 జీపీల్లో రూ.1.11 కోట్లు ఇంటి పన్ను బకాయిలు ఉన్నట్లు తెలిపారు. పన్ను వసూలుకు మండలంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మంగళవారం నుంచి వసూళ్లను ముమ్మరం చేస్తామని తెలిపారు.
- **భూమిపూజ** –బోధన్‌రూరల్, మార్చి4: పెంటకుర్దులో పీఏసీఎస్ ప్రహరీ నిర్మాణ పనులకు సోమవారం సొసైటీ చైర్మన్ దొనకంటి రాజారెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు దమ్మయ్య, గోనె లస్మవ్వ, కొండపల్లి చిన్న గంగాధర్, సుబ్బారెడ్డి, బొల్లపల్లి రాము, రమేశ్‌గౌడ్, మాజీ సర్పంచులు గుండారం శంకర్, సాయిరెడ్డి, సంజీవ్‌కుమార్, సొసైటీ కార్యదర్శి బాబా పాల్గొన్నారు.
- **ఉద్యోగ విరమణ –** బోధన్ రూరల్,మార్చి 4: పెంటకుర్దు పీఏసీఎస్ కార్యదర్శి పోతారెడ్డి ఉద్యోగ విరమణ పొందడంతో సోమవారం సొసైటీ చైర్మన్ అమర్‌నాథ్ బాబు ఆధ్వర్యంలో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి సీఈవోగా రావుస్‌ను నియమిస్తున్నట్లు అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవీంద్రబాబు వెల్లడించారు. సంఘం వైస్ చైర్మన్ రమేశ్ గౌడ్, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.
- **నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక-** వేల్పూర్, మార్చి 4: మండల కేంద్రంలో మంగళవారం ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీవో సురేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



మోర్తాడ్ మండలం దోన్‌పాల్ గ్రామంలో వేంకటేశ్వరస్వామి జాతరను సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్నదానం చేశారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి రథోత్సవం నిర్వహించారు. – మోర్తాడ్, మార్చి4